చాముండేశ్వరీదేవికి విశేష పూజలు



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి ఆలయంలో బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చప్పరోత్సవాన్ని శుక్రవారం జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. కర్పూర హారతులతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు నూతలపాటి అనిల్‌శర్మ, మాచవోలు రామకృష్ణ, మప్పిరాల కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వేడుకగా అంకురార్పణ

అంకురార్పణ, ధ్వజారోహణను ఉదయం నిర్వహించారు. సంతానం లేని మహిళలకు కొడి ముద్దలను పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారు ఆలయం నుంచి గ్రామానికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో గజవాహనసేవను శనివారం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

క్లుప్తంగా

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

• ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



సమస్యలను తెలుసుకుంటున్న ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్): సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేశామని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం ఆయన నిర్వహించారు. బదిలీలు, గ్రేడ్ ఇంక్రిమెంట్, సస్పెన్షన్ రిలీఫ్, డిప్యుటేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, అనారోగ్యం తదితర సమస్యలపై అర్జీలను సిబ్బంది సమర్పించారు. వీటిని పరిశీలించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయాధికారులను ఆదేశించారు. అనంతరం పలువురు సిబ్బందిని ఖాళీల ఆధారంగా వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేశారు.

కమిషనర్ సంతకం ఫోర్జరీయా..!

• కఠిన చర్యలకు సీపీఐ నేతల డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు చేపట్టాలని సీపీఐ నెల్లూరు నగర కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. సంతపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఐఏఎస్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేశారనే వార్తలు కొన్ని రోజులుగా వస్తున్నాయని చెప్పారు. నగరంలోని అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ భవనాల కట్టడాలు పూర్తయ్యాక అన్నీ సక్రమంగా ఉంటే పది శాతం మార్ట్‌గేజ్‌ను తిరిగి యజమానులకు చెల్లించాల్సి ఉందని చెప్పారు. అయితే నిర్మాణాలు పూర్తి కాకుండానే కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మార్ట్‌గేజ్‌ను విడుదల చేశారని చెప్పారు. ఘటన వెనుక మేయర్ భర్త ప్రమేయం ఉందనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా విచారణ చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నేతలు రామరాజు, నాగేంద్రబాబు, లీలామోహన్, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాజు, రమేష్‌బాబు మాట్లాడారు. సభ్యులు గోపాల్‌రెడ్డి, జయదేవ్, మాలేపాటి బాబూరావు, నరేంద్రరెడ్డి, రాఘవేంద్రశెట్టి, రవిచంద్ర, లోకేష్, మాల్యాద్రి, గఫార్, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని యనమలవారిదిన్నె సమీపంలో గల జాతీయ రహదారి పక్కన నివాసం ఉంటున్న పేదలకు ఆహార పొట్లాలను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఆడిపూడి లోకేష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీహరి, దుర్గ, కార్తికేయ, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పొట్టేపాళెం సమీపంలోని పొర్లుకట్ట వద్ద నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు రమేష్‌రాజు, ప్రసాద్, అభిషేక్, బాలాజీ, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ తగదు



పరీక్షిస్తున్న వైద్యులు

ముత్తుకూరు: ఆరోగ్యంపై అశ్రద్ధ తగదని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు పేర్కొన్నారు. పోర్టులోని ఈహెచ్ఎస్ విభాగంలో వైద్య శిబిరాన్ని అదానీ మెడికల్ సెంటర్, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య పరీక్షలను తరచూ చేయించుకోవాలని సూచించారు. అనంతరం 125 మంది ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. వైద్యులు నాగరాజు, రవికిరణ్, ఈహెచ్ఎస్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి, మనీష్‌దావే, నాగరాజు, జయలాల్, రాంబాబు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న సుధీర్‌బాబు

ముత్తుకూరు: రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని ఏపీజెన్‌కో సీఈ సుధీర్‌బాబు పేర్కొన్నారు. సీఐటీయూ 54వ వార్షికోత్సవం, ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్ వద్ద రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముజఫర్ అహ్మద్, మోహనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు, ప్రసాద్, రామయ్య, సుమన్. గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

పొదలకూరు: పొదలకూరు – రాపూరు మార్గంలోని మర్రిపల్లి చెరువు వద్ద ఉన్న డబుల్ రోడ్డు మలుపు వాహనచోదకులకు దడ పుట్టిస్తోంది. ఈ మలుపు వద్ద లెక్కకు మించి రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. క్షతగాత్రులైన వారు, మత్యువాత పడిన వారూ ఉన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా వీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రమాదకరంగా మలుపు

నూతన భవనాలు అందుబాటులోకి..

కొడవలూరు: చంద్రశేఖరపురంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్‌లో నూతనంగా నిర్మించిన భవనాలు అందుబాటులోకి వచ్చాయని ఐటీడీఏ పీఓ మందా రాణి పేర్కొన్నారు. మండలంలోని చంద్రశేఖరపురంలో గల ఈఎమ్మార్ఎస్‌లో నూతనంగా నిర్మించిన అదనపు గదులు, డైనింగ్ హాల్ భవనాలను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఇక్కడి ఈఎమ్మార్ఎస్‌లో ఉన్నత పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల ఉండటంతో అదనపు గదులు, ప్రత్యేక భోజనశాల అవసరం ఏర్పడిందని చెప్పారు. వీటి ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, వెంటనే మంజూరు చేశారని తెలిపారు. నిర్మాణ పనులను కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేశారని వివరించారు. భవనాలను ఐటీడీఏ స్వాధీనం చేసుకొని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గురుకులంలో పరిశుభ్రత పాటించేలా ప్రత్యేక చర్యలు చేపడతామని వెల్లడించారు. డీటీడబ్ల్యూఓ పరిమళ, ప్రిన్సిపల్ విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

వాడవాడలా రక్తదాన శిబిరాలు



రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో..



పినాకినీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(అర్బన్): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. వీటిని ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పరిశీలించారు. నోవా బ్లడ్ బ్యాంక్‌లో పినాకినీ లయన్స్ క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఐఆర్సీఎస్ సభ్యులు.. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్య సిబ్బంది తదితరులు రక్తదానం చేశారు. ఏడీఎంహెచ్ఓ సైతం రక్తదానం చేసి స్ఫూర్తిగా నిలిచారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వాహనచోదకుడికి గాయాలు

పొదలకూరు: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటన పట్టణంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరు నుంచి సోమశిలకు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. ఈ క్రమంలో రాపూరు మండలం తెగచర్ల నుంచి నెల్లూరుకు బైక్‌పై వెళ్తున్న శివానందరెడ్డిని ఢీకొంది. ప్రమాదంలో శివానందరెడ్డి కుడి మోకాలు విరిగింది. బస్సును అధిగమించే క్రమంలో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడ్ని 108లో పొదలకూరు సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శివబాలకృష్ణ

పొదలకూరు: ఇన్‌చార్జి తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా డిప్యూటీ తహసీల్దార్ శివబాలకృష్ణ కొనసాగుతున్నారు. తహసీల్దార్ వీరవసంతరావు ఈ నెల 28 వరకు సెలవుపై వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొత్త తహసీల్దార్‌ను ఇక్కడ నియమిస్తారా.. లేక శివబాలకృష్ణనే కొనసాగిస్తారాననే అంశం తెలియాల్సి ఉంది.

లేఅవుట్లలో పరిశీలన

పొదలకూరు: పట్టణానికి సమీపంలో ఉన్న లేఅవుట్లను తహసీల్దార్ శివబాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. కొత్తగా వేసిన లేఅవుట్లకు సంబంధించిన పత్రాలు, పూర్తి వివరాలను అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం నెల్లూరు మార్గంలో ఉన్న రెండు లేఅవుట్లను పరిశీలించారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరులోని ఆస్థాన వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని పీఎంపీ, రూడ్స్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. లితికారెడ్డి మొదటి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమా న్ని తల్లిదండ్రులు వెంకటరెడ్డి, యమున చేపట్టారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, నేతలు శేషయ్య, శ్రీనివాసులు, సుబ్బారావు, మహబూబ్‌బాషా, ముక్తియార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సు రేపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వేదాయపాళెం): ఆరోగ్యం అందరికీ అందాలనే నినాదంతో ఎన్నో చర్యలు చేపట్టిన ప్రజారోగ్య ఉద్యమకారుడు, దివంగత డాక్టర్ జెట్టి శేషారెడ్డి అని జేఎస్ విజ్ఞాన కేంద్ర స్మారక సదస్సు నిర్వహణ కమిటీ కన్వీనర్ నగేష్ కొనియాడారు. హరనాథపురంలోని జేఎస్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తొలుత స్మారక సదస్సులను నిర్వహించనున్నామని తెలిపారు. పుల్లయ్య, మాదాల రాము, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (టౌన్): విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు హర్ష కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపండి



మనుబోలులో..



కొడవలూరులో..

మనుబోలు: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని బద్దెవోలు, కట్టువపల్లిలో ర్యాలీని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యా బోధన చేస్తారని తెలిపారు. వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యకర్తలు దొరసానమ్మ, రాధ, ఉమామహేశ్వరి, రమణమ్మ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: అంగన్‌వాడీ బడిబాటపై కొడవలూరులోని ఎన్టీఆర్ కాలనీలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడారు. మూడు నుంచి ఐదేళ్ల వయసున్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త యాస్మిన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జ్వాలాముఖి ఆలయ వార్షికోత్సవాలు

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండలో కొలువైన జ్వాలాముఖి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో అమ్మవారికి విశేష పూజలను రోజూ నిర్వహించనున్నారు. భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవాల్లో ఈ నెల 17న చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. భక్తులు భారీగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ప్రధానార్చకుడు బొడ్డుపల్లి శ్రీనివాసశర్మ కోరారు.



సేంద్రియ వ్యవసాయం లాభదాయకం

కొడవలూరు: సేంద్రియ వ్యవసాయం రైతులకు లాభదాయకమని సినార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు జవహర్ పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయంపై పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక సంఘబంధ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో సాగు చేయడం ద్వారా వ్యవసాయ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకర ఉత్పత్తులను అందించొచ్చని వివరించారు. ఏపీఎం రుక్మిణి, ఏపీఓ రాజశేఖర్, సినార్డ్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవల్లిక, నిర్వాహకురాలు మునెమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జవహర్

శ్రీవారికి హంసవాహనం బహూకరణ

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి హంసవాహనాన్ని చెన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, పద్మజ శుక్రవారం బహూకరించారు. రూ.1.75 లక్షలతో దీన్ని దాతలు తయారు చేయించారు. ప్రత్యేక పూజలను దేవస్థాన నిర్వాహకులు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.



రక్తదానాన్ని బాధ్యతగా భావించాలి



రక్తదానం చేస్తున్న యువకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రక్తదానం చేయడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని సీహెచ్‌సీ డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని సార్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

హామీలను తప్పక నెరవేరుస్తారు

కోవూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు తప్పక నెరవేరుస్తారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేతలతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. జెట్టి రాజగోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

చేగువేరాకు ఘన నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యువ విప్లవకారుడు చేగువేరా జయంతిని నగరంలోని 11వ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో డీవైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ, నేతలు బాబు, సాయి, గణేష్, శేఖర్, ప్రవీణ, మధు తదితరులు పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న సచివాలయ కార్యదర్శులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు సచివాలయ కార్యదర్శులు అండగా నిలిచారు. 54వ డివిజన్లోని జనార్దన్‌రెడ్డి కాలనీలో గల టిడ్కో గృహ సముదాయంలో సుభాషిణి నివసిస్తున్నారు. కొంతకాలంగా హైపటైటిస్ బీ, హృద్రోగ తదితర సమస్యలతో ఈమె బాధపడుతున్నారు. భర్త దూరం కావడంతో తల్లి మరియమ్మ, ఐదేళ్ల కుమార్తెతో ఉంటున్నారు. వీరు ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో విషయాన్ని తెలుసుకున్న 53, 54వ డివిజన్లకు చెందిన సచివాలయ కార్యదర్శులు తమ వంతుగా రెండు బియ్యం బస్తాలు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. సాయం చేయాలనుకునేవారు 72889 03283 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

